ప్రజాశక్తి

బుధవారం 22 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ఘనంగా దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో సోమవారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రజలు టపాసులు కాలుస్తూ, దీపాలు వెలిగిస్తూ పండుగ చేసుకున్నారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో హరిత దీపావళితో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ.. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, దీప కాంతుల వెలుగులో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యావరణహిత దీపావళిని జరుపుకుంటూ ఆదర్శవంతంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని, వాయు కాలుష్యం కట్టడిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు.



హరిత దీపావళి వేడుకలు జరుపుకుంటున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కుటుంబ సభ్యులు

నేడు వైద్య సేవ నెట్వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తమకు రావాల్సిన బిల్లుల మంజూరులో ప్రభుత్వం అనుసరిస్తున్న తీవ్ర అలసత్వాన్ని నిరసిస్తూ బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఎన్టీఆర్ వైద్య సేవ నెట్వర్క్ హాస్పిటల్స్ యాజమాన్యాలు ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) ప్రతినిధులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత 13 రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవలను తాము నిలిపివేసినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడంతో ధర్నాకు ఉపక్రమించినట్లు ప్రకటించాయి.

24న 'ఉదారవాదానికి ఆవల'పై చర్చాగోష్టి

హాజరుకానున్న ప్రభాత్ పట్నాయక్

విజయవాడ : "ఉదారవాదానికి ఆవల" అన్న అంశంపై ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలకు నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో చర్చా గోష్టి జరుగుతుంది. సోషల్ సైన్సెస్ ట్రస్ట్, ప్రోగ్రెసివ్ ఫోరం, ఎంబివికె, మన మంచి పుస్తకం సంయుక్త ఆధ్వర్యాన జరిగే ఈ చర్చాగోష్టిలో వక్తగా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) ఎమెరిటస్ ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ పాల్గొంటారు.

పోలీసుల త్యాగం స్ఫూర్తిదాయకం

- పోలీసు అమరవీరుల సంస్మరణలో మంత్రి కొల్లు రవీంద్ర
- నివాళులర్పించిన సిపి రాజశేఖరబాబు, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా), విజయవాడ : శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చూపిస్తున్న ధైర్య సాహసాలు అపూర్వమని, త్యాగం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర, ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, కృష్ణాజిల్లా ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. మచిలీపట్నం, విజయవాడల్లో మంగళవారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. మచిలీపట్నంలోని పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎపిఎస్ ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలుంచి ఘన నివాళు లర్పించారు. అమరవీరుల సంస్మరణ ర్యాలీలో పాల్గొన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న విధి నిర్వహణలో అసువులు బాసిన సీనియర్ ఐపిఎస్ అధికారి కె.ఎస్.వ్యాస్ విగ్రహానికి పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, డిసిపిలు కె.జి.వి.సరిత, ఎస్.వి.డి.ప్రసాద్ తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముందుగా సిపి మంగళగిరిలోని ఎపిఎస్‌పి 6వ బెటాలియన్ గ్రౌండ్‌లో రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యాన జరిగిన సంస్మరణ కార్యక్రమంలో ఇతర ఉన్నతాధికారులతో కలిసి పాల్గొని పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల దినం సందర్భంగా మచిలీపట్నంలో మంత్రి కొల్లు మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత సరిహద్దు భూభాగంలో 20 మంది పోలీసులు వీరోచితంగా పోరాడి 10 మంది అసువులు బాశారన్నారు. వారి త్యాగనిరతిని అందరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ముష్కరుల బారి నుండి నిరంతరం ప్రజలను రక్షిస్తూ విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. సమాజ పరిరక్షణకు దేశవ్యాప్తంగా 2024-25లో 151 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు ఉన్నారన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. పోలీసుల సంక్షేమం నిమిత్తం లక్ష రూపాయల (మిగతా 2లో)



మంగళగిరి, విజయవాడల్లో నివాళులర్పిస్తున్న సిపి ఎస్.వి.రాజశేఖరబాబు



మచిలీపట్నంలో నివాళులర్పిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డికె.బాలాజీ, ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ

చెరకు ధర ప్చ్...

- కెసిపి పెంచిన ధర రూ.114.50 మాత్రమే
- రైతులకు పెరిగిన పెట్టుబడి ఖర్చే అధికం
- మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

పెట్టుబడి వ్యయానికి అనుగుణంగా పంటకు ధర రాకపోవడంతో చెరకు సాగును రైతులు మానుకుంటున్నారు. ఈ నేపథ్యంలో చెరకు సాగు విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. సాగు విస్తీర్ణం కనిష్ట స్థాయికి పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం సలహా ధర ప్రకటించకపోవడమూ చెరకు సాగు సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోంది. మరోవైపు 2025-26 సీజన్‌కు ఇటీవల కెసిపి యాజమాన్యం ప్రకటించిన చెరకు ధర కూడా సంక్షోభంలో ఉన్న చెరకు సాగుకు ఊతమిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కృష్ణాజిల్లాలో 8,200 ఎకరాల విస్తీర్ణంలో చెరకు సాగవుతోంది. కెసిపి యాజమాన్యం ప్రకటించిన ధర కన్నా ఈ సీజన్లో ఎరువులు, చెరకు కొట్టడం, రవాణా ఛార్జీలకు టన్నుకు రూ.194 అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కెసిపి యాజమాన్యం నామమాత్రంగా పెంచిన ధరలు చూసి రైతులు పెదవి విరుస్తున్నారు.

గిట్టుబాటుకాని ధర

గత సీజన్లో కెసిపి యాజమాన్యం చెరకు పంటకు ప్రోత్సాహకాలతో కలిపి రైతులకు టన్నుకు రూ.3,576 చెల్లించింది. 2025-26 సీజన్లో టన్నుకు రూ.3,690.50 చెల్లించనున్నట్లు ప్రకటించింది. అంటే టన్నుకు కేవలం రూ.114.50 మాత్రమే పెంచింది. ఎకరాకు సగటున 37 టన్నులు దిగుబడులు వస్తాయని అంచనా. గతేడాదితో పోలిస్తే 37 టన్నులకు కలిపి రైతుకు రూ.4,236.50 మాత్రమే అదనపు ఆదాయం వస్తోంది. పెరిగిన పెట్టుబడి వ్యయంతో పోలిస్తే కెసిపి యాజమాన్యం పెంచిన ధర గిట్టుబాటు కాదని చెరకు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పంట సాగులో కాంప్లెక్స్, యూరియా ఎరువులను అధికంగా వినియోగించాల్సి ఉంటుంది. ఎకరం విస్తీర్ణంలో సాగుకు 7 కాంప్లెక్స్, 10 యూరియా కట్టలు వినియోగిస్తారు. సగటున ఈఏడాది 50 కిలోల కాంప్లెక్స్ ఎరువు బస్తా ధర రూ.120 పెరిగింది. రూ.260 ఉండే యూరియా బ్యాగ్‌ను బ్లాక్‌లో రూ.100 అదనంగా చెల్లించి రూ.360కు రైతులు కొనుగోలు చేయాల్సి వచ్చింది. కాంప్లెక్స్‌కు రూ.840, యూరియాకు రూ.1000 అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఎరువులపై మొత్తం రూ.1,840 అదనపు పెట్టుబడితోపాటు చెరకు నరుకుడు, రవాణా ఖర్చులకు టన్నుకు ఏటా రూ.70 వరకు పెరుగుతోంది. దీన్ని పరిగణలోకి తీసుకున్నప్పుడు 37 టన్నులకు మరో రూ.2,590 వరకు అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఎరువులు, నరకడం, రవాణాలపై పెరిగిన వ్యయం రూ.4,430గా ఉంది. కెసిపి యాజమాన్యం పెంచిన ధరను పరిగణలోకి తీసుకుంటే రైతుకు పెరిగిన ఖర్చే రూ.194 అధికంగా ఉంది.



సంక్షోభంలో చెరకు సాగు

కెసిపి యాజమాన్యంలోని ఉయ్యూరు, లక్ష్మీపురం (మిగతా 2లో)

రివైజ్డ్ డిఎ జిఒ విడుదలపై హర్షం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఉద్యోగుల్లో ఉన్న గందరగోళాన్ని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రివైజ్డ్ జీవో 62, 63 విడుదల చేయడం పట్ల ఏపీ ఎన్జీజీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి చైర్మన్ ఏ.విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, సిపిఎస్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటే షెడ్యూలులో మూడు విడతలుగా డీఎ బకాయిలు విడుదల చేయటం వారికి స్వాంతన కలిగించిందని వారు పేర్కొన్నారు. ఉత్తర్వులలో ఉన్న ఇబ్బందులను ముఖ్యమంత్రికి, సిఎంఒ అధికారుల దష్టికి తాము తీసుకెళ్లామని వారు పేర్కొన్నారు. వెంటనే స్పందించిన సిఎంకు, చీఫ్ సెక్రటరీకి, సిఎంఒ అధికారులకు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫ్ ఫైనాన్స్ పీయూష్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. పిఆర్‌సి కమిటీ తదితర అంశాల్లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై రాజీలేని ధోరణి అవలంభిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్

అండర్ - 19 కుస్తీ పోటీలు ప్రారంభం

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పాఠశాలల క్రీడా సమాఖ్య (ఏపీఎస్‌జీఎఫ్) అండర్ - 19 అంతర్ జిల్లాల కుస్తీ పోటీలు స్థానిక అశోక ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జీ భూషణం, నున్న జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సూరపనేని రవి ప్రసాద్, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ జీ కుమార్, టోర్నమెంట్ పరిశీలకుడు సీహెచ్ రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి 13 జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు హాజరయ్యారు. అండర్ - 19 బాలుర, బాలికల ఫ్రీ స్టైల్, బాలుర గ్రీకో రోమన్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడు భూషణం, టెక్నికల్ కమిటీ ఇన్‌చార్జి పీ ఆనంద్, శాప్ కోచ్‌లు కె మనోహర్, ఎస్ కనకదుర్గ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి టీ శ్రీలత పాల్గొన్నారు.






ప్రగతి సూచికల్లో ప్రతి శాఖా ఏ గ్రేడ్ సాధించాలి

కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి - విజయవాడ : కీలక ప్రగతి సూచిక (కెపిఐ)లలో జిల్లా ర్యాంకు ముందంజలో ఉండాలంటే ప్రతి శాఖా ఉత్తమ పనితీరు కనబరచాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కెపిఐలపై అన్ని శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ... కొన్ని శాఖలు బి, సి గ్రేడులలో ఉన్నాయని, దీంతో జిల్లా ర్యాంకు ప్రభావితం అవుతోందని చెప్పారు. అన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్‌ఆర్) నిర్వహించాలని చెప్పారు. ప్రతి చిన్నారి అంగన్వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూడాలని అన్నారు. పట్టణ ప్రాంతాలలో ఇంటి నుంచి చెత్త సేకరణ 100 శాతం జరగాలన్నారు. ఐటిఐ విద్యార్థులకు యాడ్ ఆన్ కోర్సుగా కత్రిమ మేధ(ఏఐ) నేర్పించాలని ఆదేశించారు. జిల్లా విపత్తు తగ్గింపు వ్యూహాన్ని అన్నిచోట్లా అమలు చేయాలని చెప్పారు. ఉన్నత విద్య, ఇంధన శాఖలు ఏం గ్రేడు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

వైసిపిలోకి వెళ్లేందుకే ఎంపిపై కొలికపూడి ఆరోపణలు : టిడిపి

విజయవాడ : ఎంపి కేశినేని శివనాథ్ కార్యాలయంలో అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని తిరువూరు ఎంఎల్ఎ కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలను టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఖండించారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతరావు, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జి.వి.నరసింహారావు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ మాట్లాడుతూ కొలికపూడి ఎంఎల్ఎగా ఎన్నికైన నాటి నుండీ వివాదాస్పదుడుగా గుర్తింపు పొందారని అన్నారు. ఆయన వ్యవహార శైలిపై త్రిసభ్య కమిటీ వేసినా ఎటువంటి మార్పులేదన్నారు. ఎంఎల్ఎగా ఆయన పనికిరారని, నియోజకవర్గ నేతలతో సరైన సఖ్యత లేదని అన్నారు. సంక్రాంతికి పండగ సందర్భంగా రూ.60 లక్షల నుండి రూ.70 లక్షల వరకు వసూలు చేశారని ఆరోపించారు. రేషన్ బియ్యం అక్రమంగా అమ్ముకునే దళారుల నుంచి నెలనెలా మామూళ్లు అందుకుంటున్నారని ఆరోపించారు. వైసిపిలోకి వెళ్లే ప్రయత్నంలోనే ఆయన ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎంఎల్ఎ కొలికపూడి ముందుగా టిడిపి విధివిధానాలు, సిద్ధాంతాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. ఎంపి శివనాథ్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. వెంటనే కొలికపూడి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పోలీసుల త్యాగం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

విరాళం ప్రకటించి చెక్కును ఎస్‌పికి అందజేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే శాంతిభద్రతలో అదుపులో ఉంటాయన్నారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినం కేవలం ఒక కార్యక్రమం కాదని, పోలీసు కుటుంబాల ఆత్మ గౌరవానికి, ధైర్యానికి, త్యాగానికి చిహ్నమన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు వివి నాయుడు, సత్యనారాయణ, డిఎస్‌పి రాజా, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని పాల్గొన్నారు. విజయవాడలో సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు. కె.ఎస్.వ్యాస్ అడుగుజాడల్లో ప్రతి పోలీసు అధికారీ నడుచుకుంటున్నారని పేర్కొన్నారు. మావోయిస్టుల అణచివేతలో వ్యాస్ కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా ముందుగా గుర్తొచ్చేది పోలీసులేనన్నారు. వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి సమాజం కోసం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు.

చెరకు ధర ఫ్...

(మొదటి పేజీ తరువాయి)

ఫ్యాక్టరీలు, ఇతర యాజమాన్యంలోని హనుమాన్ జంక్షన్ ప్యాక్టరీల పరిధిలో గతంలో 46 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంట సాగయ్యేది. కేంద్ర ప్రభుత్వ కనీస మద్దతు ధరతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలు చెరకు పంటకు సలహాధరను ప్రకటించాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సలహా ధరను ప్రకటించడంలేదు. దీంతో చెరకు సాగు రైతులకు పెట్టుబడి ఖర్చులు రావడం లేదు. ఈనేపథ్యంలో క్రమేణా సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. హనుమాన్ జంక్షన్, లక్ష్మీపురం చక్కర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. ఉయ్యూరు ఫ్యాక్టరీలో మాత్రమే చెరకు క్రషింగ్ జరుగుతోంది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో ఒకప్పుడు 20 వేల ఎకరాల విస్తీర్ణంలో చెరకు పంట సాగయ్యింది. ఫ్యాక్టరీలో 2022-23 సీజన్ వరకు నాలుగు లక్షల టన్నులు క్రషింగ్ జరగ్గా, 2024-25 సీజన్లో 2 లక్షల 64 వేల టన్నులకు క్రషింగ్ పడిపోయింది.



మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

బందరు అభివృద్ధి ఓర్వలేకే విమర్శలు : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

మచిలీపట్నంలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక పేర్ని నాని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజల్ని, వ్యాపారుల్ని వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. 2014లో ఎన్నికలకు ముందు తనపై ఇన్ కం ట్యాక్స్‌తో సోదాలు నిర్వహించి వేధించారన్నారు. మచిలీపట్నంలో వేలాది మందికి ఉపాధి కల్పించిన తన కుటుంబంపై పేర్ని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కొనకళ్ల బుల్లయ్య, తాను కలిసి భూములు కొట్టేశామని చెప్పడానికి పేర్ని నాని సిగ్గుపడాలన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పటికీ చట్టబద్ధంగానే నడచుకున్నాం తప్ప ఎక్కడా తప్పు చేయలేదన్నారు. ఆర్య వైశ్యుల్ని బెదిరిస్తున్నామని, వేధిస్తున్నామని చెప్పడం హేయమన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులపై అత్యాచారం కేసులు పెట్టించిన నాని కులం, మతం ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయడంలో సిద్ధహస్తుడని విమర్శించారు. ఎలాంటి వ్యాపారాలు లేవని చెప్పుకునే పేర్ని నానికి వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయో చెప్పాలన్నారు. మూడు స్తంభాల సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు ఉన్న రోడ్డును విస్తరించేందుకు అవసరం మేరకు అందరితోనూ చర్చలు జరుపుతున్నామని, షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయిస్తామని, బెల్లంకొట్ల సందులో వ్యాపారులతో చర్చలు జరిపిన తర్వాతే ముందుకు వెళ్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పదవుల కోసం ముడుపులు తీసుకున్నామని పేర్ని నాని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.



రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి మండలంలోని కళ్లేపల్లి-కుమ్మరిపాలెం-అడపావారిపాలెం రహదారి దెబ్బతిన్న కారణంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతన్న విషయాన్ని గమనించి, ఆ సమస్యను పరిష్కరించేందుకు స్థానిక నాయకుడు గోళ్ల శ్రీనివాసరావు ముందుకు వచ్చి రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. సందర్భంగా బాదర్ల లోలాక్షుడు, మెరకనపల్లి నరేష్ పనులను పరిశీలించారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనం స్వాధీనం

ప్రజాశక్తి-నందివాడ: నిబంధనలకు విరుద్ధంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని నందివాడ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా నుండి ఏలూరు జిల్లా గుడిపాడు, వడ్డీగూడెం ప్రాంతానికి బొలెరో వాహనంలో కోడి వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని నందివాడ గ్రామంలో ఎస్సై కే శ్రీనివాస్ స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

విద్యార్థి చదువుకు సాయం

ప్రజాశక్తి-కంకిపాడు: టిడిపి మండల అధ్యక్షులు సూదిమళ్ల రవీంద్ర కుమార్తె అమృత సాహిత్య బిటెక్ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ ఫీజుకు రూ.1.50 లక్షలు ఎస్సీ నాయకుల సమక్షంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మంగళవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



మేయర్‌ను కలిసిన ఎసిజి రవీంద్రరావు





ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఎ.రవీంద్రరావు మంగళవారం నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిని విఎంసిలోని తన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో మేయర్‌కు మొక్కను అందజేశారు. నగరాభివృద్ధికి కృషి చేయాలని ఎసిజికి మేయర్ సూచించారు. అలాగే ఎసిజి రవీంద్రరావును నగరపాలక సంస్థ మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ తరుపున నాయకలు జి అజయ్‌కమార్, శ్రీహరి, శ్రీనివాస్, సత్యనారాయణ, ప్రకాష్ కలిసి మొక్కను అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ద్యోగులకు సంబంధించిన సర్వీసు మేటర్స్‌ను త్వరితగతిన పరిష్కారం చేయాలని యూనియన్ నేతలు కోరారు. ఆయా స్థాయిల్లో ప్రమోషన్లు ఇప్పటికే కొన్ని పూర్తి అయ్యాయని, జూనియర్ అసిస్టెంట్స్, రికార్డు అసిస్టెంట్స్‌కు సంబంధించి ప్రమోషన్లకు సంబంధించిన ఫైల్స్ పరిష్కారం చేయాల్సి ఉందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ యూనియన్ తరపున సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని వారు తెలిపారు. దీనిపై ఎసిజి మాట్లాడుతూ...ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను, వారి అంశాలను త్వరగా పరిష్కారం చేయడానికి తనవంతుగా కృషి చేయడం జరుగుతుందని ఎసిజి పేర్కొన్నారు. అయితే విఎంసి పాత బిల్డింగ్‌తో పాటు నూతన బిల్డింగ్‌లో ఏఏ సెక్షన్లు, అధికారులు ఎక్కడెక్కడ ఉన్నారనే విషయంపై అవగతం చేసుకునేందుకు ఎసిజి ప్రతి సెక్షన్ విజిట్ చేసి, సంబంధిత సెక్షన్ హెడ్‌లను కలుస్తూ సమాచారం అడిగి తెలుసుకున్నారు. మేనేజర్ వి ప్రభావతి సెక్షన్ల వారీగా ఎసిజికి అన్ని వివరాలు తెలుపుతూ ఆయన వెంట పర్యటించారు. ఉన్నారు. అయితే ఏడాదికి పైగా ఎసిజి పోస్టు ఖాళీగా ఉండటం, సంబంధిత చాంబర్ వివిధ అవసరాలకు ఉపయోగించడం, ప్రస్తుతం ఆడిట్‌కు సంబంధించిన రికార్డులతో నిండి ఉన్న చాంబర్‌ను, ఎసిజి విధులు నిర్వర్తించడానికి వీలుగా అన్ని విధాలుగా చాంబర్‌ను ముస్తాబు చేస్తున్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



ప్రజాశక్తి-ఘంటసాల: పేద వర్గాలకు, విద్యార్థుల విద్యాభివృద్ధికి చిట్టూర్పుకు చెందిన శ్రీనివాస స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వక్కలగడ్డ శ్రీనివాసరావు సాయమందించటం అభినందనీయమని ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఘంటసాల మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలోని మూడు ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీనివాసరావు ఎస్ఐ చేతులమీదుగా 60 మందికి నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యాభివద్ధి కోసం కషి చేస్తున్న నిర్వాహకులు వక్కలగడ్డ శ్రీనివాసరావును పలువురు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజంలో ప్రతీ ఒక్కరూ సాటివారికి సాయం చేయాలనే తలంపులో ఉండాలని తెలిపారు. అనంతరం అనారోగ్యంతో బాదపడుతున్న వక్కలగడ్డ రామారావుకు స్వచ్ఛంద సంస్థ తరపున రూ.4 వేలు ఆర్థిక సాయమందించారు. సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ ఏడాది శ్రీనివాసరావు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. పేదవర్గాలకు, వద్ధులకు బట్టలు, దుప్పట్లు అందించటం, అనారోగ్య బాధితులకు ఆర్థికసాయం. కరోనా సమయంలో కూడా సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దాసరి బసవ కుటుంబరావు. బూసి సుబ్రహ్మణ్యం, మల్లంపల్లి హేమాద్రి రజాక్, పోతార్లంక శివ వెంకట రత్నం, పామర్రు సాయి, కొండ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్‌వివి సత్యనారాయణ, సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పోలీసు అమర వీరులకు ఘన నివాళులర్పించారు. అలానే అమరవీరుల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



కంకిపాడులో...

కంకిపాడు: ఈడుపుగల్లు సెంటర్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకు ఎస్ఐ డి.తాతాచార్యులు, సత్యం సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ వంతెన సెంటర్లో పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. రాజీవ్ సెంటర్లో అమరుల స్మారక స్తూపం వద్ద కూటమి నాయకులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు బండే రాఘవ, పర్చూరీ దుర్గాప్రసాద్, ఘంటసాల రాజమోహన్రావు, మండలి రామ్మోహన్రావు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో...

అమర జవాన్ షేక్ హాజీ హుస్సేన్ స్తూపం వద్ద నివాళు లర్పించారు. జిల్లా పరిషత్ హైస్కూల్లో ఐటిబిపి కోర్స్ 56వ బెటాలియన్ కమాండెంట్ శ్రీహరి సింగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 56 కమాండ్ ఫోర్స్ విశాఖపట్నం ఏఎస్ఐ కరం డెన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, పోలీస్ సిబ్బంది రౌతు జీవన్, స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మత్తి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.జగన్మోహనరావు మాట్లాడుతూ విద్యార్థులకు, కృషి పట్టుదల అవసరమన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు మార్గదర్శకంగా నివాలన్నారు. చదువులోనూ, ఆటల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దేవ జయరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆనందకుమార్, కంప్యూటర్ శాఖ అధిపతి డాక్టర్ కె.సత్యరాజేష్, ఐక్యూఏస్సీ కోఆర్డినేటర్ హిమాలినిదేవి పాల్గొన్నారు.

ఉత్సవాల పేరుతో కాలయాపన : గౌతమ్

ప్రజాశక్తి-అవనిగడ్డ: మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి ఉత్సవాల పేరుతో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అభివృద్ధి వదిలిపెట్టి కాలయాపన చేస్తున్నారని వైసీపీ యువనేత బడే గౌతమ్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగు పార్టీలు మారడం మినహా ఈ ప్రాంతానికి చెప్పుకోదగ్గ నాలుగు పనులైన చెయ్యని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఉత్సవాల పేరుతో వారసత్వాన్ని ప్రమోట్ చేస్తున్నారన్నారు. దివిసీమలోని పంట పొలాలకు ఏ విధంగా పంట నీరు అందించాలని నిరంతరం తపన పడిన కృష్ణారావు తన తదనంతరం రాజకీయ స్వలాభం కోసం తన విగ్రహాన్ని కోడూరు, నాగాయలంక మండలాలలోని వేలాది ఎకరాలకు నీరు అందించే ప్రధాన పంట కాలవ గట్టును ఆక్రమించి మరీ పెడతారని ఊహించి ఉండరన్నారు. ఇప్పటికైనా విగ్రహ రాజకీయాలు మాని ప్రజా సంక్షేమానికి కృషి చేయాలన్నారు.

స్వ డైమండ్స్‌కు ప్రచారకర్తగా ప్రీతిజింటా

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ ఫైన్ జువెలరీ బ్రాండ్లలో ఒకటైన స్వ డైమండ్స్, ప్రముఖ నటి ప్రీతి జి జింటాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఆమె నిత్యనూతనమైన అందం, ఆత్మవిశ్వాసంతో కూడిన ఉనికితో, స్వ డైమండ్స్ భారతదేశం, యూఏఈ అంతటా తమ ఉనికిని బలోపేతం చేసుకునే దిశగా ఒక సాహసోపేతమైన అడుగు ముందుకు వేసినట్లు తెలిపారు. తమ కొత్త ప్రచారం, యాజ్ రియల్ యాజ్ యూ.. సహజత్వాన్ని వేడుకగా జరుపుకుంటుందని అన్నారు.

24న హుండీల లెక్కింపు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: వేమవరం గ్రామంలోని కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో హుండీలను ఈ నెల 24వ తేదీ శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు మంగళవారం తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే మోహన్ తదితరుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగుల డిమాండ్లపై స్పందన హర్షణీయం

ప్రజాశక్తి-చల్లపల్లి: ఉద్యోగుల డిమాండ్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించడం హర్షణీయమని ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ చల్లపల్లి యూనిట్ అధ్యక్షులు తోట సుధాకరరావు అన్నారు. మంగళవారం చల్లపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతూ దీపావళి పండుగ కానుకగా నవంబర్ నెల నుంచి ఒక డీఏ విడుదల చేయటం, అరవై రోజుల్లో హెల్త్ కార్డ్ సిస్టమ్ సక్రమంగా నడిపించేందుకు కమిటీ ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశించటం ఆనందదాయకం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజులలో ఉత్తర్వులు జారీచేస్తామని చెప్పటం, చైల్డ్ కేర్ సెలవులపై సీఎం ప్రకటన మహిళా ఉద్యోగుల్లో ఆనందం నింపిందన్నారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి పీవీ మాధవేంద్రరావు, సహాధ్యక్షులు పూసపాటి బ్రహ్మానందరావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఘంటసాల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

కస్తూరి సీతారామయ్య స్కూల్లో ఆట పరికరాలు ఏర్పాటు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 50 డివిజన్ కస్తూరి సీతారామయ్య నగరపాలక సంస్థ పాఠశాలలో రూ.9 లక్షల నిధులతో విద్యార్థులకు ఆట వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందని డివిజన్ సిపిఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. విద్యార్థులు క్రీడాపరికరాలు ఇబ్బంది పడుతున్న పరిస్థితులను నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ దష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించి ఆట వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ పి ఆనంద్, స్కూలు హెడ్మాస్టర్ స్వర్ణలత, మాస్టర్ శివ నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు దుర్గగుడిలో గాజుల అలంకరణ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : దుర్గమ్మ దేవస్థానంలో గురువారం నిర్వహించే గాజుల అలంకరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం ఉదయం గాజుల అలంకరణ నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఈవో శీనా నాయక్, పాలకమండలి చైర్మన్ గాంధీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 23న గాజుల అలంకరణ నేపథ్యంలో దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె.శీనాయక్ మహామండపం ఆరవ అంతస్తులో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. గాజుల అలంకరణ కోసం యాత్రికులు పెద్ద సంఖ్యలో గాజులను విరాళంగా సమర్పించారు.

మహిళలకు ఉచిత కేన్సర్ పరీక్షలు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ: ఇండేన్ గ్యాస్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం విద్యాధర పురంలోని రమ్యకృష్ణ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత మల్లాది రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రమ్యకృష్ణ గ్యాస్ ఏజెన్సీస్ ప్రాంగణంలో ఇండియన్ గ్యాస్ కస్టమర్లకు, మహిళలకు, సిబ్బందికి ఉచిత కేన్సర్ పరీక్షలను నిర్వహించారు. గుంటూరుకు చెందిన ఒమేగా హాస్పిటల్స్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి.నాగ కిషోర్ ఆధ్వర్యంలో మహిళలకు మమోగ్రామ్ స్క్రీనింగ్, పాప్ స్మియర్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ మహిళల ఆరోగ్య విషయమై కేన్సర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇండెన్ గ్యాస్ విజయవాడ జోన్ సీనియర్ మేనేజర్ హరి ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. విజయవాడ జోన్ ఇండేన్ గ్యాస్ సేల్స్ ఆఫీసర్ వి.జస్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహిళలందరూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గ్యాస్ ఏజెన్సీస్ అధినేత మల్లాది రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఉచిత కేన్సర్ పరీక్షలను నిర్వహించామని చెప్పారు. ఒమేగా హాస్పిటల్స్ కార్పొరేట్ మేనేజర్ కే.బాపురెడ్డి మాట్లాడుతూ బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్స్ జన్యుపరంగా వచ్చే అవకాశం ఉందని, అటువంటి మహిళలు ప్రతి ఏటా క్యాన్సర్ సంబంధిత పరీక్షలను చేయించుకోవాలని తెలిపారు.

26న రజక ఆకాంక్ష సభ

ప్రజాశక్తి - తిరువూరు : ఆంధ్రప్రదేశ్ రజక వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సి.సావిత్రి ఆధ్వర్యంలో ఈ నెల 26న తిరువూరు మండలం లక్ష్మీపురంలోని మను గార్డెన్స్‌లో జరగనున్న రజక ఆకాంక్ష సభ నిర్వహిస్తున్నట్లు రజక చైతన్య సంఘం నాయకులు గూడెల్లీ రాఘవరావు, పగిడిపల్లి గోపాలరావు, తమ్మారపు ఆదినారాయణ, నాగారపు కృష్ణారావు, బండి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రజక ఆకాంక్ష సభ కర పత్రాలను ఆవిష్కరించారు.

ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ నిరసనలు



వాంబేకాలనీలో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు విధించిన సుంకాలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో పలు చోట్ల ట్రంప్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ట్రంప్ సుంకాలపై ప్రధాని మోడీ మౌనం వీడి సమాధానం చెప్పాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

విజయవాడ : వాంబే కాలనీ జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్ వద్ద 60వ డివిజన్ సిపిఎం ఆధ్వర్యంలో ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ... ట్రప్ పన్నుల విధానంపై ప్రజలందరూ ఏకమైన ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ఎస్.కె పీరుసాహెబ్, పాల్గొన్నారు.

విజయవాడ సిటీ : నగరంలోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్ నుండి విజయవాడ 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు సాయిబాబా గుడి వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్ లైడర్, 50వ డివిజన్ కార్పొరేటర్ పశ్చిమ నగర కార్యదర్శి బి సత్యబాబు, సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు టి పైడయ్య మాట్లాడుతూ.. దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చే విధంగా ఉన్న ట్రంప్ సుంకాల విధింపు చర్యలను విద్యార్థులు, ఉద్యోగులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కేసరి బాబు, నగర కమిటీ సభ్యులు పి రాజు, ఎం కొండారెడ్డి, ఎస్ సుబ్బారెడ్డి, ఎండి మస్తాన్, సిపిఐ నాయకులు ఎం దుర్గారావు. ఏవైఎఫ్ఐ నగర అధ్యక్షులు కే భార్గవ్, ఐద్వా నగర సహాయ కార్యదర్శి కె వరలక్ష్మి, సిఐటియు నాయకులు కె. లక్ష్మణ, ఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయవాడ అర్బన్ : ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ సిపిఎం 9, 14, 15 డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం రామలింగేశ్వర నగర్ వద్ద ట్రంప్ ఫోటోను దహనం చేశారు. ఈ నిరసనలో తూర్పు సిటీ నగర కమిటీ సభ్యులు యన్.నాగేశ్వరరావు, వి.బి.రాజు, వి.గురుమూర్తి, బి.రవీంద్ర పాల్గొన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ట్రంప్ అడుగులకు మడుగులొత్తే లొంగుబాటు వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. సిపిఎం 29, 1 మధురానగర్ గుణదల డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో పప్పుల మిల్ సెంటర్ వద్ద ఆందోళనలో సిపిఎం సీనియర్ నాయకులు పి కృష్ణమూర్తి, సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు ఎస్ కె షకీల, డివిజన్ కార్యదర్శి బి శివప్రసాద్ పాల్గొన్నారు. **గంపలగూడెం :** గంపలగూడెంలోని తోట మూలలో దిష్టిబొమ్మను దహనం చేశారు. అమెరికా ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గువ్వల సీతారామరెడ్డి, మీసాల గోపాలకృష్ణ, జానపాటి వెంకటేశ్వరరావు, మల్లవరపు కుటుంబరావు, పాల్గొన్నారు. **ఎ.కొండూరు :** ఏ.కొండూరులోని కంభంపాడు మెయిన్ సెంటర్‌లో ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు మాట్లాడుతూ.. విచక్షణారహితంగా పెంచిన సుంకాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కంభంపాడు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

విజయవాడ : సిపిఎం 62, 63, 64, 61 డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో రాధానగర్ అపార్ట్మెంట్ల వద్ద ట్రప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం సిహెచ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం నగర నాయకులు భూపతి రమణారావు, కె దుర్గారావు పాల్గొని మాట్లాడుతూ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ప్రజలందరూ కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు పి.వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



50వ డివిజన్‌లో..



రాంలింగేశ్వరనగర్‌లో..

వర్షానికి తడిసిన మొక్కజొన్న



ప్రజాశక్తి- నందిగామ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట తడుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నంది గామ మండలంలో వెయ్యి ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. ఎకరానికి సుమారు రూ.15 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మొక్కజొన్న కోసిన తర్వాత తేమ ఉండటంతో ఆరబెడుతున్న క్రమంలో వర్షాలు పడుతుండడంతో పంట పూర్తిగా తడిసిపోతుంది. తడిసిన మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మొక్కజొన్నకు సరైన గిట్టుబాటు ధర కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని గౌరవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా ఇందిరా క్రాంతి పథకంలో ధన్య గ్రూపు, విజేత డ్వాక్రా గ్రూపుల సభ్యులకు రూ.35 లక్షల చెక్కులను పిఎసిఎస్ చైర్మన్ కట్టా వెంకట నరసింహారావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్తవరపు వెంకటేష్ పావని, పిఎసిఎస్ సీఈఓ నెట్టెం నాగేశ్వరరావు సిబ్బంది పాల్గున్నారు.

టయోటా అర్బన్ క్రూయిజర్ విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఏరో ఎడిషన్‌ను ఆవిష్కరించినట్టు టీకేఎం ప్రతినిధి వరింధర్ వాద్వా తెలిపారు. నగరంలోని టయోటా షో రూమ్ నందు ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఇది టయోటా ప్రసిద్ధ ఎస్‌యూవీకి మరింత పేరు ప్రఖ్యాతులు, ప్రీమియం అప్పీల్‌ను తీసుకువచ్చే పరిమిత ఎడిషన్ స్టైలింగ్ ప్యాకేజీ అని అన్నారు. ఫ్రంట్ స్పాయిలర్ కొత్త ఫ్రంట్ స్పాయిలర్ జోడించడంతో ఎస్‌యూవీ బోల్డ్ క్యారెక్టర్ పెరుగుతుందని తెలిపారు. రియర్ స్పాయిలర్ శైలి, పనితీరు రెండింటికీ అనుగుణంగా రూపొందించబడిన ఈ కొత్త రియర్ స్పాయి లర్ ఏరోడైనమిక్ సామర్థ్యానికి దోహదపడుతూనే స్పోర్టీ అప్పీల్‌ను పెంచుతుందని తెలిపారు.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పట్టణ శివారులో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సత్య నారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. తిరువూరుకు చెందిన కొత్తపల్లి వసంతరావు, విజయవాడకు చెందిన పితాని చంద్రశేఖర్, తాడి రవిశేఖర్‌లు భద్రాచలం ఏరియా సీలేరు నుండి గంజాయి తీసుకుని బైక్‌పై వస్తుండగా మంగళవారం తిరువూరు శివారు పిటి.కొత్తూరు పోస్టు బేసిక్ స్కూల్ సమీపంలో అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

రాజకీయ కుట్రలో భాగంగానే దుష్ప్రచారాలు : టిడిపి



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : తమ రాజకీయ ఎదుగుదలను ఎదుర్కొ నలేక, పథకం ప్రకారం తప్పుడు ఆరోపణలతో విష ప్రచారం చేస్తున్నారని 40, 42వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పీవీ చిన్ని సుబ్బయ్య, పత్తి నాగేశ్వరరావు పేర్కొన్నారు. భవానీపురం శివాలయం సెంటర్లో ఇడ్లీ బండి వ్యాపారం నిర్వహించే శివ అనే వ్యక్తి నుంచి తాము డబ్బులు డిమాండ్ చేశామని తప్పుడు కథనాల్ని ప్రచారం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. భవానీపురంలో వారు మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చిట్టి ఇడ్లీ బడ్డీ కొట్టు నిర్వాహకుడు, స్థల యజమానికి మధ్య వివాదం నెలకొందన్నారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదంలో తాము మధ్యవర్తులుగా వ్యవహరించి సర్ది చెప్పినందుకు తమపైనే కాకుండా తమ పార్టీ మీద శివ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై వస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ ఉత్సవాల్లో కార్టూనిస్టులకు ప్రాధాన్యత

- **ఎపి కార్టూనిస్టుల సంఘం అధ్యక్షుడు బాచి**



ప్రజాశక్తి -విజయవాడ సిటీ : బెజవాడలో ముప్పయ్యేళ్లుగా ఎన్నో మహాసభలు జరిగాయని, గతంలో ఎప్పుడూ లేని విధంగా జాతీయ ఉత్సవాల్లో కార్టూనిస్టుల్ని గుర్తించి, వారికి ప్రాధాన్యతనివ్వడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం (ఆకాసం) రాష్ట్ర అధ్యక్షుడు బాచి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ మహా సంకల్పంతో ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సహకారంతో మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ నిర్వహణలో నవంబరు 22, 23 తేదీలలో కృష్ణాతీరాన విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో జరుగనున్న 'జాతీయ సాంస్కృతిక ఉత్సవాల' కరపత్రాన్ని మంగళవారం ప్రకాశం బ్యారేజీ వద్ద ఆవిష్కరించారు. అనంతరం బాచి మాట్లాడుతూ.. మల్లెతీగ నిర్వహణలో కవులు, కార్టూనిస్టులు, కళాకారులు, కార్టూనిస్టులు ఒక గొడుగు కిందికి రావడం చారిత్రాత్మక సన్నివేశమని అన్నారు. జాతీయ సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ మాట్లాడుతూ.. కార్టూనిస్టులు, కవులు, కళాకారులు ఈ నెల 25వ తేదీలోగా 83329 03156 నెంబరులో ప్రతినిధులుగా పేర్లు నమోదు చేసుకుని ఉత్సవాలకు హాజరుకావచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కార్టూనిస్టులు పద్మ, మురళీధర్, ఉత్సవాల నిర్వహణ కమిటీ బాధ్యులు యేమినేని వెంకట రమణ, చొప్పా రాఘవేంద్రశేఖర్ పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై నిరసన


మొవ్వలో...

ప్రజాశక్తి-మొవ్వ: భారత్‌పై ట్రంప్ సుంకాల పెంపునకు నిరసనగా ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చినముత్తేవి


గన్నవరంలో...

గ్రామంలో సోమవారం ట్రంప్ ఫ్లెక్సీలను దహనం చేశారు. భారత దేశ వ్యవసాయ ఉత్పత్తులపై ట్రంప్ ఇటీవల పెంచిన సుంకాల ప్రభావం పడకుండా, దేశ రైతాంగం నష్టపోకుండా పాలకులు కృషి చేయాలని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణ రావు, వేములవాడ నాగ బసవయ్య కడవకొల్లు మురళి, విష్ణు దాసు సత్యనారాయణ, తూములూరు వీరయ్య, కూనపురెడ్డి వీరవసంతరావు, క్రోవి సూర్యనారాయణ, పామర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **బంటుమిల్లి:** బంటుమిల్లిలోని అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, మండల కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, జనార్దన్‌రావు, గోరిశెట్టి నారాయణ, కన్నరావు, సుంకర వెంకన్న, సుబ్బయ్య పాల్గొన్నారు. **ఉంగుటూరు (గన్నవరం) :** గన్నవరం టౌన్‌లో కూడలి ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేసి గాంధీ బొమ్మ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లోనూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, కైలే ఏసుదాసు, సూరగాని సాంబశివరావు, మిరప నాగేశ్వరావు, పొనుగుమాటి ఆంథోని, జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.


బంటుమిల్లిలో...



చింతపల్లి పాపారావుకు నివాళి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): చింతపల్లి పాపారావు 76వ వర్థంతిని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దావాజీగూడెం, అల్లాపురం, బుద్ధవరం గ్రామాల్లో పార్టీ స్థూపాలపై జెండాలు ఎగురవేసి ఆయనకు నివాళులర్పించారు. దావాజీగూడెంలో జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చింతపల్లి పాపారావు తెలంగాణ సాయుధ పోరాటానికి మద్దతుగా పేద వర్గాలను సమీకరించిన నాయకుడని, దీనిని జీర్ణించుకోలేని అప్పటి ప్రభుత్వం సూరంపల్లిలో పోలీసులతో ఆయన్ను కాల్చించిందని వివరించారు. సిపిఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి మాట్లాడుతూ చింతపల్లి పాపారావు మరణం గన్నవరం ప్రాంత ఉద్యమాలకు పునాది అని, అలాంటి ఉద్యమాన్ని నిర్మించి ప్రజా సమస్యలపై పోరాటం చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, కైలే ఏసుదాసు, సూరగాని సాంబశివరావు, కళ్లం రాంబాబు, బి.తాతబ్బాయి, నూతక్కి రామ్మోహన్రావు, ముక్కామల ఉమామహేశ్వరరావు, కొండా వీరాస్వామి, పోతురాజు నాగేశ్వరావు, విజయారావు తదితరులు పాల్గొన్నారు.

డిఎ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉద్యోగుల డిఎ జిఒను ప్రభుత్వం సవరించాలని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె శేషగిరి, బి.లంకేష్ కోరారు. జిఒ 60లో డిఎను అక్టోబర్ నెల జీతానికి చెల్లించేటట్లుగా ఉన్నప్పటికీ డిఏ బకాయిలను మాత్రం ఉద్యోగి రిటైర్డ్ అయిన లేదా చనిపోయిన లేదా పదవి విరమణ చేసిన తరువాత ఇస్తానని చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. పెన్షనర్స్‌కి ఇచ్చిన జిఓ 61లో డిఏ బకాయిలు 2027-28 ఆర్థిక సంవత్సరంలో 12 విడతలలో ఇస్తామనడం దారుణమన్నారు. డిఏ, డిఆర్ బకాయిలను చెల్లించే విషయమై పునరాలోచన చేసి, బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. డిఎకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60, 61లు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లను కలవరానికి గురి చేశాయని వాటిని తక్షణం సవరించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబూరాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. రెండు సంవత్సరాలకు పైగా పిఆర్సి జాప్యం అయినప్పటికీ పిఆర్సి కమిషన్ను నియమించకుండా, ఐఆర్ కూడా ప్రకటించకుండా, నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఒక డిఎను మంజూరు చేస్తూ విడుదలైన ఉత్తర్వులు ఉద్యోగుల్లోనూ, విశ్రాంత ఉద్యోగుల్లోనూ తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయని తెలిపారు. డిఎ బకాయిల చెల్లింపును ఉద్యోగ విరమణ సమయానికి వాయిదా వేయడం, విశ్రాంత ఉద్యోగులకు సైతం 2027-28 ఆర్థిక సంవత్సరంలో వాయిదాలలో చెల్లించేలా ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదని పేర్కొన్నారు.

సెల్‌ఫోన్‌ను అతిగా వాడొద్దు



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరూ ముఖ్యంగా చిన్నపిల్లలు సెల్‌ఫోన్ చూడడానికి అలవాటు పడుతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీం బేగ్ పుట్టినరోజు సందర్భంగా మచిలీపట్నం మోడరన్ ఐ కేర్ నిర్వాహకులు మహమ్మద్ నియాజ్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ పాలెం ఉర్దూ షాది ఖానాలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ భానుమూర్తి వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజంలో చంటి పిల్లలకు సెల్‌ఫోన్ చూపిస్తే గాని ఆహారం తీసుకోవడం లేదని, అది మంచి పద్ధతి కాదన్నారు. యువత ఎక్కువ సమయం సెల్‌ఫోన్ ఉపయోగించడం వల్ల వయసు పెరిగిన తర్వాత దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. సెల్‌ఫోను అత్యవసర సమయాల్లోనే ఉపయోగించాలని, చీకట్లో సెల్ ఫోన్ వినియోగం మరింత ప్రమాదకరమన్నారు. ప్రతిఒక్కరు కంటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ కాగిత రాకేష్, న్యూరో సర్జన్ డాక్టర్ పరస లక్ష్మీ భావన, కృష్ణాజిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరస మధుసూదనరావు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మోడరన్ ఐ కేర్ యజమాని ఎండి.నియాజ్‌ను అభినందించారు.

వాలీబాల్ పోటీలకు విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-చల్లపల్లి: చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పి హైస్కూల్ విద్యార్థిని కుంచె దివ్య వాలీబాల్ సీనియర్ అండర్-17 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికై ఈ నెల 22వ తేదీ గుడివాడలో జరిగే పోటీల్లో పాల్గోనుంది. అండర్-14 జట్టుకు అద్దంకి హారిక, యూ.దుర్గా శ్రీవల్లి, గంజాల అశ్విని, భోగాది సుస్మిత ఎంపికయ్యారు. మంగళవారం జట్టును పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, నోడల్ అధికారి రేణుప్రసాద్, పీఈటీ శ్రీనివాస్ అభినందించారు. ఎస్ఆర్‌వైఎస్‌పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరపున విశ్రాంత ప్రిన్సిపాల్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తగిరిశ సాంబశివరావు క్రీడాకారులకు టీ షర్టులను అందచేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్, పాగోలు దుర్గా ప్రసాద్, ఆఫీస్ సూపరిటెండెంట్ శాస్త్రి పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ ప్రభుత్వ రైల్వే స్టేషన్ పరిధిలో రామవరప్పాడు రైల్వే స్టేషన్-నిడమానూరు రైల్వే స్టేషన్ల మధ్యలో సుమారు 30 సంవత్సరాలు వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ మహబుబ్ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నుండి నరసాపురం వెళ్లే రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుని చాతి ఎడమ వైపు రాధిక అనే పచ్చబొట్టు, ఎడమ చేతిపై శ్రావణి ఆర్ఎస్ఆర్ పచ్చబొట్టు, కుడి చేతిపై అమ్మానాన్న అనే పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతుడు నలుపు రంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, వివరాలు తెలిసిన వారు 9440627570, 9866221412 నెంబర్లకు సమాచారం తెలపాలని అన్నారు.


ఫ్రిజ్ ఏర్పాటు

ప్రజాశక్తి-గుడివాడ: స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం బయట ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు నాని కుమారుడు పృధ్వీ పుట్టిన రోజును పురస్కరించుకుని నిత్యం పేదలకు అందుబాటులో ఆహారం నిల్వ చేసే ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, 1వ, 2వ పట్టణ సిఐలు శ్రీనివాస్, హనీష్, టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.



వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-పామర్రు: మండల పరిధిలోని యలకుర్రు, ప్రాకర్ల గ్రామాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, జడ్పిటిసి కూనపురెడ్డి స్వరూపరాణి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు నత్తా రవికుమార్ పాల్గొన్నారు.



జిల్లాస్థాయి పోటీలకు తమిరిశ విద్యార్థులు

ప్రజాశక్తి-నందివాడ: గుడివాడ డివిజన్ అండర్-17 బాలబాలికలకు కబడ్డీ సెలక్షన్ మంగళవారం ఎన్టీఆర్ స్టేడియంలో జరిగింది. ఈ సెలక్షన్లో నందివాడ మండలం తమిరిశ గ్రామానికి చెందిన జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎన్.మనీషా, ఎం తేజశ్రీలక్ష్మి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్‌రావు తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ ప్రసాద్, పిఈటి మహేష్‌లను ఎంఈఓ డేవిడ్ రత్నరాజు అభినందించారు.



ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: లైసెన్సు కలిగిన ఆటో, రవాణా కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న సాయం అందించాలని సిఐటియు నాయకులు బూర సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్ ఆటో వర్కర్స్ యూనియన్ సమావేశం మధుసూదన్‌రావు శ్రామిక భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేరళలో మాదిరిగా ఆంధ్రప్రదేశ్లో లైసెన్స్ కలిగిన రవాణా, ఆటో రంగ కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలతో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆటో మెటీరియల్ సబ్సిడీతో అందించాలని



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కోరారు. మచిలీపట్నం సిఐటియు కన్వీనర్ సిహెచ్ జయరావు మాట్లాడుతూ రవాణా రంగ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, రాపిడ్, ఉబర్ లాంటి సంస్థల వల్ల ఆటో కార్మికులకు ఉపాధి కరువుతున్న పరిస్థితి నెలకొందని, ఆటో స్టాండ్ల వద్ద వాటిని కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే.వై .దాసు, ఉపాధ్యక్షులు గోరిపర్తి శ్రీను (కొండ), కార్యదర్శి ఎన్ ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ఎండి బాబు, కోశాధికారి ఎండి మున్వర్ బేగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ ఐక్యతకు కషి చేసిన సీనియర్ నాయకులు ఎండి మున్వర్ బేగ్‌ను ఆటో కార్మికులు సన్మానించారు.

సుడిదోమ నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - తిరువూరు : పంట చేతికందే సమయంలో సుడిదోమ వరి పంటను ఆశించే అవకాశం ఉన్నందున నిర్మూలన చర్యలు చేపట్టాలని తిరువూరు మండల వ్యవసాయ అధికారిణి పి పద్మ రైతులకు సూచించారు. వరిలో సుడిదోమ నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలను మంగళవారం ఆమె రైతులకు వివరించారు. ఎసిఫేట్ 75 ఎస్పి 1.5 గ్రాములు లేక ఇమిడాక్లోప్రిడ్, ఎథిప్రోల్ (80 డబ్ల్యూజీ) 0.25 గ్రాములు లేదా పైమెట్రోజైన్ (50డబ్ల్యూజి) 0.6 గ్రా లేదా ఫ్లోనికామిడ్ (50 ఎస్ జీ) 0.4 గ్రాముఉల లేదా డైనోటెఫ్యురాన్ (20 ఎస్ జీ) 0.4 గ్రాములు లేదా ట్రైఫ్లుమిజో ఫైరిం (10 ఎస్‌సీ) 0.48 మిలీలు లీటరు నీటిలో కలిపి పైరుపై పిచికారీ చేయాలని తెలిపారు.

గురుధాంలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని బలుసుపాడు గ్రామంలోని శ్రీ గురుదమ్ ధర్మక్షేత్రంలో దీపావళి వేడుకలు సోమవారం రాత్రి సాంప్రదాయ రీతిలో జరిగాయి. ప్రముఖ తాత్వికులు శివశ్రీ గెంటేల వెంకటరమణ గురుగంపతుల ఆధ్వర్యంలో గురు కుటుంబ సభ్యులు దీపాలను వెలిగించి శ్రీ శివానందమూర్తి భగవానులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ప్రజాశక్తి-మైలవరం : స్థానిక లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గత నాలుగు వారాలుగా జరుగుతున్న ఇంటర్ ప్రెన్యూర్‌షిప్ కం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం మంగళవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖపట్నంలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ శిక్షణ అధికారి, ప్రిన్సిపల్ డాక్టర్ కె మురళీకృష్ణ మాట్లాడుతూ.. నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం రూపొందించబడిందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు, ఎల్‌బిఆర్‌సిఈ కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, డీన్ సూర్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సన్మానం



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన డి శకుంతలను మండల కో ఆప్షన్ సభ్యులు పఠాన్ నాగుల్ మీరా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కేతనకొండ గ్రామంలో వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న మోటార్ చెడిపోయి చాలా రోజులైందని, దానివలన కొన్ని ప్రాంతాలకు మంచినీటి సమస్య ఏర్పడిందని, వెంటనే దానికి మరమ్మతులు చేయాలని కోరారు. దీనికి ఎంపిడిఒ సానూకూలంగా స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేవస్థానానికి విరాళం



ప్రజాశక్తి-వత్సవాయి : శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థాంలో జరిగే నిత్యాన్న దానానికి పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన గీతా వీరమ్మ.. రూ.5,116లు విరాళంగా అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌కు విరాళం అందజేశారు. వారికి ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, తుంగ శశికాపూర్ లు ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి



ప్రజాశక్తి - తిరువూరు : రాష్ట్రంలో జనగణన ద్వారా కులగణన చేసి బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను ఎబిసిడిలుగా విభజించి అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ బిసి విభాగం నాయకులు మంగళవారం తిరువూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. 42 శాతం రిజర్వేషన్ల వలన ఉద్యోగ నియామకాల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, సంక్షేమ పథకాల విషయంలో బిసిలకు సరైన న్యాయం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ఓబిసి సెల్ చైర్మన్ నల్లమోలు శ్రీనివాసరావు అన్నారు. ఆదిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెండెం నాగేశ్వరరావు, కట్టా సుబ్బారావు, జీడిమళ్ల వెంకటేశ్వరరావు, పులిపాటి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: యుటిఎఫ్ జగ్గయ్యపేట మండల శాఖ ఆధ్వర్యంలో యుటిఎఫ్ సభ్యులు చావా కృష్ణయ్య (రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జెడ్ పి హెచ్ ఎస్ గండ్రాయి) సౌజన్యంతో మంగళవారం జగ్గయ్య పేటలోని సబ్ ట్రెజరీ కార్యాలయానికి (ఎస్ టిఒ) రూ.10 వేలు విలువగల వాటర్ డిస్పెన్సర్‌ను బహుకరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం కష్ణయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చావా కష్ణయ్య, ఉపాధ్యాయులు జి .వి.నరసింహారావు, సబ్ ట్రెజరీ ఉద్యోగులు నరేష్ , ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.


స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు సౌజన్యంతో నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్ఎంఎంఎస్) కోసం సిద్ధమయ్యే 8వ తరగతి విద్యార్థుల ఉపయోగార్థం రూపొందించిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ.. సబ్జెక్టు నిపుణులతో రూపొందించిన ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జె సుధానంద్, జగ్గయ్యపేట మండల శాఖ అధ్యక్షులు అల్లిక నరసింహారావు, గౌరవాధ్యక్షులు వి వి సుబ్బారావు, మండల కార్యదర్శులు ఎం.డి మునీర్ బాషా, ఎం దేవదానం, కె వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు.

పాటిబండ్ల ప్రభాకర్‌రావు సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి -నందిగామ : సిపిఎం సీనియర్ నాయకులు పాటిబండ్ల ప్రభాకర్‌రావు పేదలకు చేసిన సేవలు శ్లాఘనీయమని ఏపీ ఇరిగేషన్ నీటిపారుదల ఎంప్లాయిస్ యూనియన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బత్తిన చిరంజీవి పేర్కొన్నారు. పాటిబండ్ల ప్రభాకర్‌రావు 44వ వర్ధంతిని మంగళవారం నందిగామలో నిర్వహించారు. తొలుత ప్రభాకర్‌రావు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. ఉద్యమాల పురిటిగడ్డ నందిగామ తాలూకాలో 8 కార్మిక సంఘాలను స్థాపించి కార్మికులకు అండగా నిలిచిన నాయకులు ప్రభాకరరావు అని గుర్తు చేశారు. ప్రభాకర్‌రావు సేవలను ప్రజలు చిరస్థాయిగా గుర్తించుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ కార్యదర్శి కట్టారపు గోపాల్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మంగళవారం రూ.14,67,129 విలువైన సిఎం సహాయనిధి చెక్కులను 24 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్సకు వెనుకాడకుండా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ, కౌన్సిలర్లు నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు, మాజీ కౌన్సిలర్ మారేపల్లి శౌరి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మల్లెల కొండయ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-గంపలగూడెం: ఈ నెల 23న గంపలగూడెంలోని తోట మూలలో ఉన్న గౌరసాని నారాయణరెడ్డి ప్రాంగణంలో రైతు సంఘం మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మండల అధ్యక్షుడు కార్యదర్శులు జి వీరభద్రం, ఎం వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభలో రైతు సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.




వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాసు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన గుంజ శ్రీనివాసును మాజీ మంత్రి, వైసీపీ మైలవరం సమన్వయకర్త జోగి రమేష్ అభినందించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను సోమవారం గుంజ శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసును దుశ్శాలువాతో సత్కరించారు. జోగి రమేష్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీ అభివృద్ధికి, పునర్ వైభవానికి కృషి చేయాలని కోరారు.

రాంకో గ్రూప్ కార్మికుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాంకో గ్రూప్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన డ్రై మిక్స్ యూనిట్‌లో కార్మికుల ఆత్మీయ కలయిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గా కో అండ్ కాంట్రాక్టర్ చల్లా వైకుంఠరావు, అడ్వకేట్, నోటరి జూనె బోయిన శ్రీనివాసరావు (జె ఎస్ ఆర్) పాల్గొని కార్మికులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు కాంట్రాక్టర్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ, స్నేహపూర్వక వాతావరణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుగు రంగా, పెసరవెల్లి గురవయ్య, గుమ్మా నర్సింహస్వామి, మార్త రవి, గొల్ల రామకష్ణ, లక్ష్మయ్య, పసుమర్తి కోటేశ్వరరావు, బలుగూరు కొండ, ఎస్‌కె లాలు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం రహదారి ధ్వంసం



ప్రజాశక్తి-వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామంలో ఇటీవల పెద్దాపురం ఏరుపాలెం ఆర్‌అండ్‌బి రహదారి రూ.80 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. మరమ్మత్తులు చేపట్టి నెల రోజులు కూడా పూర్తి కాకుండానే రోడ్డుకు గుంతలు పడి, కంకర రాళ్లు లేచి ఉండటంతో ఆ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి కాంట్రాక్టులకు పనులు అప్పజెప్పడం వల్ల పలువురు అభ్యంతర వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి రోడ్డు నిర్మాణంలో జరిగిన అవినీతినిపై విచారణ జరిపి రోడ్డు గుంతలను మరమ్మత్తులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు ఆ రోడ్డు నిర్మాణం పై జరిగిన అవినీతిపై అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

తల్లిదండ్రులకు అదృశ్యమైన విద్యార్థుల అప్పగింత



ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరులోని అంబేద్కర్ గురుకుల పాఠశాల నుండి అదృశ్యమైన ముగ్గురు విద్యార్థులను మంగళవారం పోలీసులు తల్లి దండ్రులకు అప్పగించారు. ఏ కొండూరు మండలం గొల్లమందల గ్రామానికి చెందిన అన్నదమ్ములు 6, 7 తరగతి చదువుతున్న మంకెన రిత్విక్ సాయి మణికంఠ, చంద్రశేఖర్, రామచంద్రపురం గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి ఉల్లింద్ర సాయిగణేష్ ఆదివారం నుంచి కనిపించటం లేదని ప్రిన్సిపాల్ రవిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. ఆ ముగ్గురు విద్యార్థులు తిరువూరు అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలోనీ కట్లేరు బ్రిడ్జి కింద ఉన్నారని సమాచారం అందడంతో విద్యార్థులను పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంటిపై బెంగ కారణంగా పాఠశాల నుండి పారిపోయినట్లు విద్యార్థులు తెలిపారు.

విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: దీప్తి ఎలక్ట్రికల్స్ వారు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్స్ పరికరాల అమెరిక ప్రశంసనీయమని ఎమ్మెల్యే రాజగోపాల్ కొనియాడారు. మండలంలోని షేర్మహ్మద్‌పేట ఆటోనగర్ ప్రాంతంలో దీప్తి ఎలక్ట్రికల్స్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను ఉపయోగించుకోవాలని, విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదాని మీటర్ కంపెనీ సర్కిల్ అధికారి నాగేంద్ర మరియు వారి సిబ్బంది స్థానిక ఏడి శ్రీనివాసరావు, దీప్తి ఎలక్ట్రికల్స్ ఎండి సందీప్, దీప్తి, రిటైర్డ్ లైన్ ఇన్స్పెక్టర్ ఈశ్వరి, తెలుగు యువత అధ్యక్షులు వేదులాపురి సైదా, షేర్ మహమ్మద్ పేట తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

విఎంసి కార్మికులుగా నియమించాలి



సిఐంఒహెచ్‌తో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-విజయవాడ: నగరపాలక సంస్థ పరిధిలో పలు సందర్భాల్లో విఎంసి నిర్వహించిన ఆయా కార్యక్రమాల్లో అతి తక్కువ కూలికి కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేసిన వారికి ఉపాధి చూపించడానికి చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎస్ జ్యోతిబాస్ కోరారు. ఈ మేరకు నగర కమిషనర్ తరుపున ప్రజారోగ్య విభగం ముఖ్య అధికారి (సిఎంఒహెచ్) డాక్టర్ కె అర్జునరావును కార్మికులతో కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే అలాగే ఆయా విభాగాల్లోని కార్మికులు పోరాడి సాధించుకున్న వేతనాలను అమలు చేయాలని చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాధరెడ్డిని కలిసి నాయకులు వివరించారు. ఈ సందర్భంగా సత్యబాబు, జ్యోతిబాస్ మాట్లాడుతూ...విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో వివిధ సందర్భాల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేసిన వారందరినీ విఎంసిలో పారిశుధ్య కార్మికులుగా భర్తీ చేసుకొని, వారికి ఉపాధి కల్పించాలని కోరారు. కరోనా, వరదలు, భవానీ దీక్షలు, కార్మికుల సమ్మె, స్వచ్ఛ భారత్, మలేరియా స్పెషల్ డ్రైవ్ తదితర సందర్భాల్లో అతి తక్కువ వేతనాలపై సుమారు 80 మంది కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేశారన్నారు. కౌన్సిల్ ఆమోదం ద్వారా విఎంసి పరిధిలో భర్తీ చేయాలనుకుంటున్న 150 మంది కార్మికుల స్థానంలో విఎంసిని నమ్ముకొని ఆయా సందర్భాల్లో పని చేసిన ఈ కార్మికులందరినీ తీసుకోవాలని కోరారు. పనులు లేక, కుటుంబాలు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్న కార్మికులందరినీ మూడు సర్కిల్స్ పరిధిలోని ఖాళీల్లో భర్తీ చేసుకోవాలని కోరారు. అలాగే గత జూన్ నుంచి జులై వరకు (28 రోజులు) సమ్మె చేసి సాధించుకున్న కొత్తగా వేతనాలను ఈ నెల నుంచి అమలు చేయాలని చీఫ్ ఇంజినీర్‌ను కోరారు. వాటర్ వర్క్స్, మెకానిక్స్, పార్కులు, టౌన్‌ప్లానింగ్, వీధిదీపాలు, కంప్యూటర్ ఆపరేటర్లు, తదితర కార్మికులకు ప్రభుత్వం అంగీకరించిన రూ.15 వేలు నుంచి రూ.18500 వేతనాలను ఈ నెల నుంచి సత్వరమే ఇప్పించేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే రెండు నెలల ఎనిమిది రోజుల సప్లమెంటరీ బిల్లును కూడా వీలయినంత త్వరగా కార్మికులకు ఇచ్చేటట్లు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. దీనిపై సిఎంఒహెచ్, చీఫ్ ఇంజినీర్ సానుకూలంగా స్పందిస్తూ...కార్మికులకు పని కల్పించడంతో పాటు ఆయా సెక్షన్లలోని కార్మికులకు కొత్తగా పెంచిన వేతనాలు సత్వరమే ఇప్పంచే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు హామీనిచ్చినట్లు సత్యబాబు, జ్యోతిబాస్ తెలిపారు.



భూ నిర్వాసితుల దీక్ష విరమణ

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఎలుకపాడు అసైన్మెంట్ భూ నిర్వాసితుల నిరాహార దీక్షను అధికారుల హామీతో మంగళవారం విరమించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. ఎఫ్ఎల్ఆర్ రికార్డును ఆర్డిఓకు అందజేసి రెండు రోజుల్లోపు నిర్వాసితుల సమస్య పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టివి లక్ష్మణస్వామి మాట్లాడుతూ పేదల సమస్యలు పరిష్కారం కావాలంటే పోరాటాలే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, ఎం. ప్రసంగి, పి.యాకోబు, పి.సుగుణరావు, దావీదు, సికామణి, దాసు మరియమ్మ, సుగుణ, బుజ్జి కనకరత్నం, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బసవరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం): కేసరపల్లిలో పొట్లూరి బసవరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవరావు మాట్లాడుతూ తాను పార్టీకి దూరంగా లేనని, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్నానని అన్నారు. సిఎం చంద్రబాబు పిలుపునిచ్చిన ఏ కార్యక్రమాన్నైనా తన నాయకత్వంలో అమలు చేస్తానన్నారు. భవిష్యత్తులో కార్యకర్తలు కోరి, పార్టీ అనుమతిస్తే గన్నవరం నియోజకవర్గంలో శాసనసభ్యునిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మూల్పూరి బాలకృష్ణారావు, దాసరి వెంకట బాలవర్ధనరావు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తదితర ప్రముఖులు బసవరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



మండేపూడి నాగభూషణరెడ్డి శ్రామిక భవనం పునఃప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు బస్టాండ్ వెనుక గల మండేపూడి నాగభూషణరెడ్డి శ్రామిక భవనం పున:ప్రారంభం, వర్ధంతి కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పంచకర్ల రంగారావు అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు ఎం.మాధవరావు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నాగభూషణంరెడ్డి చిత్రపటానికి సీనియర్ నాయకులు ఈడా కోటేశ్వరరావు, ఆచార్యరాజు సీనియర్ నాయకులు కే.నాంచారయ్య పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ నాగభూషణరెడ్డి కార్మిక, కర్షక బలహీన వర్గాల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. కంకిపాడు ప్రాంతంలో రైతాంగ, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. కొలవెన్ను, వల్లూరుపాలెం ప్రాంతాలలో మిగులు భూములను పేదలను పంచటంలో కీలక పాత్ర పోషించారన్నారు. కౌలు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ పేద వర్గాల ప్రజల కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి మండేపూడి నాగభూషణరెడ్డి అన్నారు. ఆయన ఆశయాలను



మాట్లాడుతున్న కేశవరావు

అనుగుణంగా అందరూ ప్రజా పోరాటాలలో పాల్గొని ప్రజల సమస్యలకు పరిష్కారం దొరికేలా పోరాటాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి నరసింహారావు, సిపిఎం మండల కార్యదర్శి టి.నరేష్, మండల కమిటీ సభ్యులు జి కుమారి, వి.శివశంకర్, సిహెచ్.శ్రీహరి, పి.దుర్గారావు, యు.రమేష్, వి.జాన్‌మోజేష్, జె.రవి, వై.జోజి, యు.ఆంజనేయులు, నాగరాజు, నాయకులు సిహెచ్ నాగేశ్వరమ్మ, టి దివ్య ప్రశాంతి, సిహెచ్‌వి రెడ్డయ్య, వేమూరి నాగేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ ఎంపిడిఒ కిషోర్‌కు సన్మానం

ప్రజాశక్తి-పామర్రు

ఎంపీడీవోగా ఉద్యోగోన్నతిపై వెళ్తున్న మండల డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కిషోర్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్తు అధ్యక్షులు దాసరి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు ఆరుమళ్ళ రమాదేవి, ఎంపీడీవో కాండ్రు జ్యోతి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి టి.మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

ప్రజాశక్తి-కంకిపాడు: అన్నా క్యాంటీన్ నిర్వహణ కోసం రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కు టిడిపి అభిమాని పీత శ్రీరామదాసు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామదాసును శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణారావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు జయంతి వేడుకలను పురస్కరించుకొని అవనిగడ్డ రాజీవ్ సెంటర్లోని కృష్ణారావు విగ్రహానికి మోపిదేవి మండలం పెదపోలు గ్రామానికి చెందిన కూటమి నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏసుబాబు, పిఎసిఎస్ చైర్మన్ నాదెళ్ల శరత్చంద్రబాబు, ప్రముఖ న్యాయవాది ఆకుల వెంకటరామయ్య, నాదెళ్ల రాజేష్, బాచు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మద్దిపట్ల జగన్మోహన్రావు పాల్గొన్నారు.

విద్యార్థినికి 'మైత్రి' ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం వడ్డీ రంగారావు నగర్‌కి చెందిన తుమ్మలగుంట అమ్ములు కుమార్తె హసీనాను మచిలీపట్నం పద్మావతి మహిళా కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం బై పీసీ చదువుతోంది. ఆర్థిక పరిస్థితులు కారణంగా విద్యా ఖర్చులు భరించలేని స్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సభ్యులు స్పందించి బెల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్ లో మంగళవారం కాలేజీ పేరిట రూ.9 వేలు ఫీజు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, సభ్యులు రామకృష్ణ మాస్టారు, సుధీంద్ర కుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం : కైలే

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెం గ్రామం లో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొని ప్రస్తుత టిడిపి పాలనను విమర్శించారు. పేద ప్రజలకు విద్య వైద్యం అందుబాటులోకి తేవాలన్న ఒక మంచి ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం అంటే దానికి అనుసంధానంగా ఏర్పడే బోధనాసుపత్రులను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెట్టడం కిందకే వస్తుందన్నారు. పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను దూరం చేయాలన్న దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరతీసింది. దీనిని ఎంత మాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొక్కిలిగడ్డ హేమలత, ఎంపీపీ ఈడుపుగంటి రాజమణి, మాజీ ఎంపీపీ కళ్ళ వెంకటేశ్వరరెడ్డి తోట్లవల్లూరు సర్పంచి పెనుమత్స రాధిక, జొన్నల రామ్మోహన్ రెడ్డి, చింతలపూడి గవాస్కరరాజు పాల్గొన్నారు.



పలుచోట్ల దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కుటుంబ సమేతంగా దీపావళి జరుపుకున్నారు. **మచిలీపట్నం అర్బన్:** హ్యూమానిటీ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు నూర్జహాన్ చిన్నారులకు టపాసులు, మిఠాయిలు పంచిపెట్టి వారితో సంతోషంగా గడిపారు. మచిలీపట్నంలోని కాలేఖాన్‌పేట కాలువ గట్టు మీద నివాసముంటున్న నిరుపేద గిరిజన కుటుంబాలకి చెందిన షుమారు 40 మంది పిల్లలకు మిఠాయిలు, టపాసులు పంచారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అజ్మతున్నిసా, ట్రెజరర్ నాగూర్ హుస్సేన్, వార్డ్ ఇంచార్జి చిన్ని, కృష్ణా యూనివర్సిటీ ప్రొఫసర్ సల్మా బేగం పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ మచిలీపట్నం ఆధ్వర్యంలో ఈడేపల్లి వృద్ధుల శరణాలయంలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పంచపర్వాల హిమబిందు, కార్యదర్శి పి.ప్రభాకర్‌రావు, కోశాధికారి శ్యాం గోల్డ్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో వృద్ధులందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్ మెంబర్ జి.రాంబ్రహ్మం, లంకిశెట్టి బాలాజీ, సభ్యులు మేడిశెట్టి యోగానందరావు, పవన్, శ్రీరామ్ భరత్ కుమార్ పాల్గొన్నారు. **గుడివాడ:** పేద ప్రజల మధ్యలో దీపావళి వేడుకలను సామాజిక కార్యకర్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్‌కె) ఘనంగా నిర్వహించారు. స్థానిక తట్టివర్రు రోడ్డులోని జరిగిన ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, ఆర్కే వారియర్స్ పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు:** అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో దీపావళిని పురస్కరించుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.



బందరులో...



గుడివాడలో...



అవనిగడ్డలో...

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ : శ్రీ లక్ష్మీ శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక గాంధీనగర్ పూర్ణానంద కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి విశేషంగా అలరించింది. వల్లేటి రాజేశ్వరి, రవితేజ, కృష్ణతేజ సహకారంతో– లలిత 'కళా సామ్రాట్', 'స్వరకేసరి' డాక్టర్ తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రధాన గాయకుడిగా జరిగిన విభావరిలో గాయనీ గాయకులు శ్యాం ప్రసాద్, జి.మంగరాజు, బొబ్బిలి మల్లేశ్వరి, శోభారాణి, పి.ఎడ్విన్ జోసఫ్, ఏ జయప్రభు, కారుమంచి రాజు తదితరులు పాడిన పాటలు శ్రోతల్ని మెప్పించాయి. సాధారణంగా జరుగుతున్న ట్రాక్ కార్యక్రమానికి భిన్నంగా ఇందులో లైవ్ ఆర్కెస్ట్రా– రవి (కీబోర్డు), రమణ (ప్యాడ్స్), వెంకట్ (తబల) కార్యక్రమానికి వన్నె తెచ్చారు. ముఖ్య అతిథులుగా అలనాటి 'లవకుశ' సినిమాలో 'కుశుడు' వి.నాగ సుబ్రహ్మణ్యంతో పాటు డా.పరుచూరి విజయలక్ష్మి, డేవిడ్ రాజు, బి.వి.వీరభద్రరావు, పైడిపాటి వెంకన్న, ప్రభల శ్రీనివాస్, జి.వి.రంగారెడ్డి తదితరులు పాల్గొని నిర్వాహకుల్ని అభినందించారు. వివాహ వార్షికోత్సవం జరుపుకున్న శ్రీనివాసరెడ్డి, లక్ష్మి దంపతుల్ని పలు సాంస్కృతిక, సేవా సంస్థల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. "తెలుగు కళావాహిని" చింతకాయల చిట్టిబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

2న 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్ ప్రదర్శన



విజయవాడ : తెలుగు జాతి గర్వించదగిన, చిరస్మరణీయ, మహా గాయకుడు, 'పద్మశ్రీ' ఘంటసాల వెంకటేశ్వరరావు బయోపిక్ నవంబర్ 2వ తేదీన విజయవాడ సినిమా థియేటర్లో ఒకే షో ప్రదర్శించనున్నట్లు నిర్మాత, దర్శకుడు సిహెచ్ రామారావు తెలిపారు. స్థానిక గాంధీనగర్ కౌతా పూర్ణానంద కళావేదికలో ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం మంగళవారం జరిగింది. సమావేశానికి ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. చింతకాయల చిట్టిబాబు సమన్వయకర్తగా వ్యవహరించారు. దాదాపు ముప్పయ్యేళ్లపాటు పదివేలకు పైగా సినిమా పాటలు పాడిన ఒక గాయకుని పూర్తి నిడివి జీవిత చరిత్రను సినిమాగా తీయడం ప్రపంచంలో ఇదే ప్రథమమని రామారావు తెలిపారు. వివిధ కళా సంఘాల అధ్యక్షులు డేవిడ్ రాజు, శ్యాం ప్రసాద్. చలపతిరావు తదితరులు కూడా సమావేశలో పాల్గొన్నారు.

వీధిలైట్లు ప్రారంభం



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అంటేనే అభివద్ధికి మారుపేరని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. మంగళవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ క్రీస్తురాజపురంలోని ఆర్‌సీఎం చర్చి దగ్గర రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన అధునాతన స్ట్రీట్‌లైట్లను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న కాలంలో కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో మరిన్ని అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందిపాటి దేవానంద్, పేరేపి ఈశ్వర్, కార్పోరేటర్ చెన్నుపాటి ఉషారాణి, నాయకులు దొమకొండ రవి, బచ్చులకూరి అజయ్‌కుమార్, యలమంచిలి రాజేష్, కోడూరు సుబ్రహ్మణ్యం, గద్దె రమేష్, ఆర్.బ్రహ్మేశ్వరరావు, జనసేన నాయకుడు అల్లుపల్లి రామకష్ణ, మాచర్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి ఆరోగ్యంగా చిన్నారి గీతా సహస్ర : కలెక్టర్



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : వైరల్ ఇన్ఫెక్షన్ సోకడంతో చికిత్స తీసుకొన్న చిన్నారి పూర్తిగా కోలుకుందని, గ్రామంలో ఎక్కడా మరో కేసు నమోదు కాలేదని, ప్రజల ఆరోగ్య పరిస్థితి సాధారణంగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కలిసి పెనుగంచిప్రోలులో కలెక్టర్ లక్ష్మీశ పర్యటించారు. తొలుత చిన్నారి గీతా సహస్ర ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలతో మాట్లాడారు. మంచి నీటి సరఫరా వ్యవస్థను, ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ప్రత్యేక బృందాలు ఇంటింటి సర్వేను పూర్తి చేశాయని, వైద్యాధికారులు మరో 24 గంటలపాటు ఇక్కడ మరో ప్రత్యేక సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఏఎన్ఎం, ఆశా సహకారంతో స్థానిక వైద్యాధికారులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ప్రైవేటు ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారం చెత్త వేయకుండా, కంపచెట్లు పెరగకుండా చూసేందుకు ఆయా స్థలాల యజమానులకు గ్రామపంచాయతీ ద్వారా నోటీసులు ఇస్తున్నామన్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించి ప్రజలకు అందించేలా నిర్దిష్ట మార్గదర్శకాలతో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. అనంతరం పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోగిపైనా ప్రత్యేకంగా పర్యవేక్షణ ఉంచి ఆరోగ్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యాధికారులకు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్‌డీవో కె.బాలకష్ణ, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని ఉన్నారు.



ఫర్నీచర్ షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానిపురం కొండవీడు అకాడమీ వెనుక గల శ్రీ శివ దుర్గ ఫర్నిచర్ మార్ట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీపావళి పండుగ నాడు షాపు నుంచి దట్టమైన పొగ వెలువడిన కొద్దిసేపటికే మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఇందిరా ప్రియదర్శిని కాలనీ వాసులు స్పందించి మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. పోలీసు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే షాపులోని ఫర్నిచర్ కొంతమేర అగ్నికి ఆహూతైంది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా? తారాజువ్వలు పడి మంటలు వ్యాపించాయా అన్నది తెలియల్సింది.

ఐడిబిఐ బ్యాంక్ నికర లాభం రూ.3,627 కోట్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఐడిబిఐ బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికపు ఫలితాలను ప్రకటించిందని బ్యాంకు రీజినల్ ఇంచార్జి ఎస్.మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికానికి నికర లాభం రూ.3,627 కోట్లుగా ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 98 శాతం వద్ధిని నమోదు చేసింది అన్నారు. నిర్వహణ లాభం రూ.3,523 కోట్లుగా ఉంది.అని, ఎన్ఐఎం 3.71 శాతంగా నమోదు కాగా, నికర వడ్డీ ఆదాయం రూ.3,285 కోట్లుగా ఉంది.అని తెలిపారు డిపాజిట్ ఖర్చు క్యూ2–2025కి 4.65 శాతంతో పోలిస్తే క్యూ2–2026కి 4.69 శాతంగా ఉంది. అన్నారు .సీఆర్ఏఆర్ 341 బీపీఎస్ వార్షిక వద్ధితో 25.39 శాతానికి మెరుగుపడింది.అని తెలిపారు .ఆస్తులపై రాబడి క్యూ2–2025కి 1.97 శాతంతో పోలిస్తే క్యూ2–2026కి 158 బీపీఎస్ పెరిగి 3.55 శాతంకి చేరుకుంది అని తెలిపారు

వర్షాలకు మైత్రి రోడ్డు ధ్వంసం

ప్రజాశక్తి-వత్సవాయి : పెనుగంచిప్రోలులోని మైత్రి రోడ్డు ఇటీవల కురిసిన వర్షాల వలన నామరూపాలు లేకుండా పాడైపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వైపు నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అంతేకాకుండా మండలంలోని సుబ్బాయి గూడెం గ్రామం వైపు నుంచి వచ్చే ప్రజలు తిరుపతమ్మ అమ్మవారి దేవాలయానికి వెళ్తుంటారు. గ్రామానికి చెందిన రైతులు ఇటువైపుగానే పొలాలకు వెళుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి తెగిపోవడంతో రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ ఏఈ పి సుందర రామయ్య స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ దృష్టికి తీసుకెళ్లగా కోటి రూపాయల మైనింగ్ నిధులు మంజూరు చేయించారని, టెండర్ ప్రక్రియలో ఉందని తెలిపారన్నారు. సాధ్యమైనంత త్వరగా ఈ రహదారిని అభివృద్ధి చేయాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: డిసెంబర్ 7న జరిగే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్ష కోసం మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు రూపొందించిన మానసిక సామర్థ్య పరీక్ష స్టడీ మెటీరియల్‌ను గౌరవరం విద్యార్థులకు మంగళవారం ప్రధానోపాధ్యాయులు గద్దే సూర్య కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఈ పరీక్షలో విద్యార్థులు ప్రతిభ చూపి స్కాలర్షిప్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహేశ్వర వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు కృష్ణారావు, రాజేష్, సురేష్ కుమార్, శంకర్రావు, పుష్ప, సిఆర్పి ఆంజనేయులు పాల్గొన్నారు.



ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలంలో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అన్నేరావుపేట గ్రామంలో టిడిపి గ్రామ అధ్యక్షులు దగాని వేణుబాబు ఆధ్వర్యంలో యువకులకు వాలీబాల్ కిట్లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రరావు, భాస్కర్ రావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు

హెడ్‌వాటర్ వర్క్స్ పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని హెడ్‌వాటర్ వర్క్సును స్థానిక ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రఘవేంద్ర రంగాపురం కౌన్సిలర్లు సోమవారం పరిశీలించారు. ఇటీవల పట్టణంలో నీటి సరఫరా సమస్యలపై అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన ఈ పర్యటన చేపట్టారు. పట్టణంలో నీటి లీకేజీలను వెంటనే గుర్తించి సరిచేయాలని మున్సిపల్ ఇంజినీర్లను ఆదేవించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ నకిరకంటి వెంకట్, పేరం సైదేశ్వర రావు, సామినేని మనోహర్, కర్ల జోజి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక ఉత్సవాలు



ప్రజాశక్తి-విజయవాడ సిటీ : పాతబస్తీలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల (పాత శివాలయం) దేవ స్థానంలో బుధవారం నుంచి కార్తీక మాస నక్త దీక్షా మహోత్సవాలు ప్రారంభమ వుతాయని దేవ స్థానం ఈవో నటరాజన్ షణ్ముగం తెలిపారు. పాత శివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దేవస్థాన ఈవో నటరాజన్ షణ్ముగం, చైర్మన్ బొమ్ము మధు, ఆలయ అర్చకులు రాచకొండ నాగరాజు శర్మ కార్తీక మాస ఉత్సవాల విశేషాలను వెల్లడించారు. బుధవారం నుంచి నవంబర్ 20వ తేదీ వరకు పాత శివాలయంలో ప్రతినిత్యం శ్రీ భ్రమరాంబ అమ్మవారికి త్రి శతి ఖడ్గమాల, సహస్రనామార్చన, శ్రీ మల్లేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన చతుర్వేద స్వస్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టండి : జెసి



ప్రజాశక్తి-విజయవాడ : విస్తృత ప్రజాప్రయోజనాలతో ముడిపడిన రైల్వే, జాతీయ రహదారులు (ఎన్‌హెచ్) ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని.. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఇలక్కియ మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్‌డీవోలు, తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. జిల్లా పరిధిలోని రైల్వే, ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు సంబంధించిన స్థితిగతులపై సమీక్షించారు. భూ సేకరణలో పురోగతిపై చర్చించారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీ వంటి రైల్వే ప్రాజెక్టులతో పాటు జాతీయ రహదారుల గ్రీన్ ఫీల్డ్ అలైన్‌మెంట్, అవుటర్ రింగ్ రోడ్డు తదితరాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ వారి మార్గదర్శకాలకు అనుగుణంగా మంజూరైన ప్రాజెక్టులను వేగవంతం చేయాలని.. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనుల్లో పురోగతి చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య ఉంటే వెంటనే తమ దష్టికి తేవాలని.. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో క్రియాశీలంగా వ్యవహరించాలని జేసీ ఇలక్కియ స్పష్టం చేశారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురి, పాల్గొన్నారు.